క్లుప్తంగా

దత్త జ్ఞానబోధ సభ

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో దత్త ఆశ్రమంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు ఆధ్వర్యంలో దత్త జ్ఞాన బోధ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా ఉత్తరాంధ్ర సాదు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి, పాలకొండకు చెందిన ప్రవచన కర్త ఎన్వీ రమణలు భక్తులనుద్దేశించి, కాసేపు ప్రసంగించారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని దైవ కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. ఉత్సాహం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం వంటి ఆరు సద్గుణాలను అందరూ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు గొర్లె దామెదరరావు, అప్పలనాయుడు మాస్టారు, శ్రీనివాసరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్‌స్తంభాన్ని సరిచేశారు..


ఒరిగిపోయిన స్తంభాన్ని నిలబెట్టిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లే జాతీయ రహదారి పక్కన, కొట్టక్కి జంక్షన్ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం కొన్ని నెలలుగా అక్కడి పొలాల్లోకి ఒరిగిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉంది. చేతికి అందినంత ఎత్తులోనే వైర్లు ఉండడంతో ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని అటువైపుగా వెళ్లే వారంతా తీవ్ర భయాందోళన చెందేవారు. దీనిపై అక్టోబరు 30వ తేదీన ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం అనే శీర్షికన సాక్షి కథనం ప్రచురించిది. ఈ కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఎట్టకేలకు ఆ స్తంభాన్ని సరిచేశారు.

సక్రమంగా సర్వే చేయాలి


సర్వే పరిశీలనలో ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల సర్వేను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది చేస్తున్న సర్వేపై ఆరా తీశారు. ఏయే ఇళ్లకు మరుగుదొడ్లు ఉన్నాయి.. ఏయే ఇళ్లకు మరుగుదొడ్లు లేవు అనే విషయాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. సక్రమంగా సర్వే చేపట్టాలని, బహిరంగ మలవిసర్జన నిర్మూలనకు కృషి చేయాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న పంచాయతీ సెక్రటరీ ప్రదీప్ తదితరులు

వంగర: మండలంలోని నీలయ్యవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెర్లాం మండలంలోని అరసబలగ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బోను భాస్కరరావు విద్యాసామగ్రి వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జయరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి లెంక ప్రదీప్ చేతులమీదుగా విద్యార్థులకు దాత ఇచ్చిన నోటు పుస్తకాలు, అట్టలు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పి.గౌరీశంకర్, ఉపాధ్యాయురాలు కె.వాసంతి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకి 30 బస్తాల దిగుబడి


పంటకోత అనంతరం ధాన్యం దిగుబడిని లెక్కిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని కొండలమామిడివలస గ్రామంలో రైతులు బావిశెట్టి అప్పన్న, అగుల నాగన్నల వరి పంటపొలాల్లో శుక్రవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల విస్తీర్ణంలో చేపట్టిన ఈ ప్రయోగంలో ఎకరానికి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామని ఏఎస్‌వో యేసుబాబు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు మొత్తం 18 ప్రయోగాలు పూర్తి చేశామన్నారు.

సన్మానం

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన రెడ్డి గోపాలకృష్ణనాయుడును అదే పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇక్కడి లాగే అక్కడ కూడా ఎప్పటిలాగే బాగా పనిచేసి మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ముద్దాడ రమణమ్మ ఆకాంక్షించారు.

- నిరుపేదలకు నిలువునీడనిచ్చిన జగనన్న కాలనీలు
- నియోజకవర్గంలో 77 లేఅవుట్‌ల నిర్మాణం
- కొత్త కాలనీల ఏర్పాటుతో గ్రామాలకు సరికొత్త రూపు


రాజాం మండలంలోని కంచరాం గ్రామ సమీపంలోని జగనన్న కాలనీ ఇళ్లు

జగనన్న కాలనీలతో.. నెరవేరిన సొంతింటి కల..!

రాజాం: సొంతిల్లు కట్టుకోవాలనే కలలుగన్న పేదవారి కలలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రాజకీయాలకతీతంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల నిర్మాణం ప్రారంభించారు. ఇల్లు కట్టుకునేందుకు కనీసం స్థలం కూడా లేని వారికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి బిల్లులు మంజూరు చేయించారు. దీంతో పలు గ్రామాల్లో పెద్దఎత్తున లేఅవుట్‌ల నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో గ్రామాలకు గ్రామాలే కొత్తగా ఏర్పడ్డాయి.

ఊరూరా కొత్త కాలనీలు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామంలో కొత్త కాలనీలు, కొన్నిచోట్ల కొత్త ఊళ్లు ఏర్పడ్డాయి. ప్రతిచోటా కనీసం 15 మంది నుంచి అత్యధికంగా 1037 మంది వరకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. పేదవాడికి ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణ బిల్లులు చెల్లించడంతో గతంలో కనీసం సెంటు భూమి కూడా లేని నిరుపేదలంతా ఇప్పుడు రూ.10 లక్షల సొంత ఇంటిని కలిగి, చక్కగా ఇళ్లల్లో నివాసముంటున్నారు. రాజాం నియోజకవర్గంలో రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో మొత్తం 77 లేఅవుట్‌లు ఏర్పడ్డాయి. వాటిల్లో ప్రజలకు ఇళ్ల నిర్మాణాలతో పాటు కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. రూ.5.80 కోట్ల వ్యయంతో విద్యుత్ సౌకర్యాలు, రూ.1.95 కోట్లతో తాగునీరు, వాడుక నీటి వసతులు, రూ.2.30 కోట్లతో రోడ్ల సౌకర్యాలు ఏర్పాటు చేశారు.


రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద జగనన్న కాలనీ..


సంతకవిటి మండలంలోని కాకరాపల్లిలో జగనన్న కాలనీ గృహాలు

రాజాం నియోజకవర్గంలో జగనన్న కాలనీ లేఅవుట్‌ల వివరాలు..

మండలం	లేఅవుట్‌ల సంఖ్య	ఇళ్లు
రాజాం అర్బన్	3 లేఅవుట్‌లు	1037 ఇళ్లు
రాజాం	24 లేఅవుట్‌లు	495 ఇళ్లు
రేగిడి	17 లేఅవుట్‌లు	309 ఇళ్లు
సంతకవిటి	16 లేఅవుట్‌లు	105 ఇళ్లు
వంగర	17 లేఅవుట్‌లు	148 ఇళ్లు

గూడు ఇచ్చి.. ఇంటి వారిని చేశారు..



మా స్వగ్రామం రేగిడి. రోజువారీ కూలి పనులు చేసి బతికేవాళ్లం. సొంతిల్లు అనేది లేదు. అటువంటి మాకు ఇంటి పట్టాతో పాటు ఇంటి నిర్మాణానికి బిల్లులను కూడా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. కొత్తగా నిర్మించుకున్న ఇంటిని చూస్తుంటే చాలా ముచ్చటేస్తుంది. జగనన్న దయతో మాకు నిలువనీడ దొరికింది.

– ఎల్.గణేష్, రేగిడి ఆమదాలవలస గ్రామం, రేగిడి మండలం.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

కార్తీక పౌర్ణమి పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున పవిత్ర స్నానమాచరించిన భక్తులు శివాలయాలకు చేరుకుని, ప్రత్యేక పూజలు, సహస్ర దీపారాధనలు, ఏకాహం భజనలు చేశారు. పలుచోట్ల చేపట్టిన జ్వాలా తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరికొన్ని చోట్ల శివలింగాకారంలో దీపాలు వెలిగించి, పరమేశ్వరుని ఆరాధించారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రేగిడి దత్తపీఠంలో శివలింగాకారంలో సహస్ర దీపార్చన


రాజాం: జ్వాలాతోరణం నిర్వహిస్తున్న భక్తులు


బాడంగిలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న దృశ్యం


బొబ్బిలిలో బ్రహ్మకుమారీల కార్తీక పౌర్ణమి పూజలు

27 నుంచి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

బొబ్బిలిరూరల్: మండలంలోని గోకుల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్(ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్) 49వ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. విజయనగరంలో ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే ఈ సభలకు అందరూ తరలిరావాలని ఆ సంఘ నాయకుడు ఒమ్మి భరత్ పిలుపునిచ్చారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా సంఘం పోరాటం చేస్తోందన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బ్లాకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శనివారం శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లంతా హాజరుకావాలని కోరారు.

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ప్రత్యేకాధికారులు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రేగి రాంబాబు మాట్లాడుతూ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు కోసం అవసరమైన ప్రణాళికల తయారీ చాలా అవసరమన్నారు. ప్రణాళికల తయారీలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో మండల ఈవోపీఆర్‌డీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు రమాదేవి, తులసి

తెర్లాం: విద్యార్థులు, యువత అంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెర్లాం 1, 2, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు రమాదేవి, తులసి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉన్నతమైన జీవనం సాగించాలని సూచించారు. అనంతరం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి


అప్పడే పుట్టిన బిడ్డ ఆరోగ్యాన్ని తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి శిరీష

రామభద్రపురం: మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారిణి ఏఎల్‌జీ శిరీష అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మాతాశిశువుల ఆరోగ్యాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైరిస్క్‌తో బాధపడుతున్న మాతాశిశువులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. పుట్టుకలో ఏమైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు గానీ, హైయర్ ఆస్పత్రికి గానీ తక్షణమే రిఫర్ చేస్తున్నామన్నారు. హిమోగ్లోబిన్ 8 శాతం కన్నా తగ్గిన గర్భిణులకు ఐరన్ ఇంజెక్షన్లు ఇస్తున్నామన్నారు. గర్భం దాల్చిన సమయంలో ఎటువంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు చేయడం జరుగుతోందని, అలా అయితే గర్భిణుల ఆరోగ్యానికి మంచిదన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


ఆక్రమణలను కూల్చివేయిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన పశువుల శాల సహా సిమెంట్ ఇటుకలతో చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం కూల్చివేశారు. సర్పంచ్ నారాయణరావు ఇక్కడి ఆక్రమణలపై లోకాయుక్తాకు ఫిర్యాదు చేయగా, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తహసీల్దారు మల్లపురెడ్డి శ్రీను శుక్రవారం జేసీబీల సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ఆయుర్వేద ఆస్పత్రి, సచివాలయం సమీపంలో కొంతమంది ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని, లోకాయుక్తా ఆదేశాలతో వాటిని కూల్చివేసినట్లు తహసీల్దారు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలకు కాగాం విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

తెర్లాం: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని కాగాం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కిల్లాన అక్షయ్‌కుమార్, గర్భాపు దినేష్‌లు ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు యందవ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వారు పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. సదరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు, సిబ్బంది శుక్రవారం అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో శుక్రవారం చేపట్టిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్నో ఏళ్లుగా భద్రపరుస్తూ వస్తున్న ఎంతో విలువైన గ్రంథాలు, పుస్తకాల గురించి పాఠకులకు తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రపంచ విజ్ఞానమంతా గ్రంథాలయాల్లోని పుస్తకాల రూపంలో ఉందని, ప్రతిఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు కోరారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాం: పుస్తకాలు చూపిస్తున్న పాఠకులు


బొబ్బిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో పాఠకులు


సంతకవిటి: పుస్తక ప్రదర్శన చేపడుతున్న లైబ్రేరియన్ శ్రీదేవి


రేగిడి: పుస్తకాల ప్రదర్శనలో విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

సంక్షిప్తంగా...

జోరుగా వరి నూర్పిడి పనులు


యంత్ర సాయంతో వరి నూర్పిడి చేస్తున్న రైతులు

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు పూర్తయిన చోట నూర్పిడి పనులు జోరుగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఎద్దులు, రోలర్‌ల సహకారంతో, మరికొన్ని చోట్ల యంత్రాల సాయంతో వరి నూర్పిడి చేసి, బస్తాల్లోకి ధాన్యం నింపుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో చాలాచోట్ల చకచకా కోతలు, నూర్పిడి పనులు జరుగుతుండడం గమనార్హం.

400 లీటర్ల బెల్లంఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న బెల్లంఊట డ్రమ్ములను చూపిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవలస గిరిజన గ్రామ పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ చిన్నంనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం ఊట, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ మెట్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందన

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్ ఉషారాణికి ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రాగా, డీఈవో మాణిక్యాల నాయుడు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పిలిపించి మరీ ఆమెను అభినందించారు.

సమయపాలన పాటించాలి


ఆగూరు సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఆగూరు, డీఆర్ఎన్‌వలస, గడిముడిదాం గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించి, సిబ్బంది పనితీరు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలన్నారు.

చురుగ్గా పశుగణన సర్వే


పొనుగుటివలసలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

రాజాం సిటీ: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పశుగణన సర్వే చురుగ్గా జరుగుతోందని ఏడీ బి.జయప్రకాష్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస, డోలపేట, బుచ్చెంపేటల్లో శుక్రవారం చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించిన సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు మోహన్, రాము తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాల స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని దక్షిణ దేవిడి వద్ద అక్రమంగా తరలిస్తున్న 46 మద్యంసీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, కోమటిపల్లి గ్రామానికి చెందిన చోడి పైడిరాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

వాహన తనిఖీలు


కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రేగిడి: మండల పరిధిలోని బూరాడ జంక్షన్‌లో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర తన సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనదారుల వాహనాలను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

వంగర: మండలంలోని రుషింగి గ్రామంలో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు శుక్రవారం చేపట్టి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌ల ఆధ్వర్యంలో మరమ్మతులకు గురైన బోర్లను మెకానిక్ వెంకటరమణ బాగుచేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. రూ.5 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ నిధులతో ఈ నిర్మాణం చేపడుతుండగా, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో సూచించారు. అలాగే త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి చిత్రపటం ఊరేగింపు



రామభద్రపురం: కార్తీకమాసం పురస్కరించుకుని, మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలాధరణ చేసిన వారంతా వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి, పాలకావిళ్లు పట్టుకుని అయ్యప్పస్వామి చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. అన్ని వీధుల్లోని భక్తులు కావిళ్లలో వేసిన పాలను తెచ్చి, స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు.